ప్రజాస్వామ్యానికి పాతర..! నామినేషన్లకు అడ్డుకుంటూ!



- రాప్తాడులో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న టీడీపీ మూకలు !
- వేలాదిమంది రౌడీలు, గూండాలతో వైసీపీ అభ్యర్థులను అడ్డుకుంటున్నారు !
- పోలీసుల సమక్షంలోనే దాడులు.. ప్రేక్షకపాత్రపై తోపుదుర్తి ఆగ్రహం !
- 81 ఎంపీటీసీ స్థానాల్లో తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా వేయనివ్వలేదు !
- అత్మకూరులో 11మంది అభ్యర్థులను పోలీసులకు అప్పగించినా నామినేషన్లు వేయించలేదు !
- కనగానపల్లిలో కర్రలు, కొడవళ్లతో వీరంగం.. ఎస్ఐ వాహనాన్ని పల్టీలు కొట్టించినా దిక్కులేదు !
- చివరి రోజైనా నామినేషన్లు వేయించండి
- ఉన్నతాధికారులకు రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విజ్ఞప్తి
- అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా.. ఉన్నతాధికారులు స్పందించాలని డిమాండ్
- జిల్లా రెవెన్యూ అధికారి మలోలాకు వినతి పత్రం అందజేత

అనంతపురం, అక్టోబర్ 22, దరువునూస్ :

రాప్తాడు నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా టీడీపీ శ్రేణులు అడ్డుకుంటున్నాయని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పరిటాల సునీత వేలాదిమంది రౌడీలు, గూండాలను రంగంలోకి దించి, పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు. తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా వేయనివ్వకుండా అడ్డుకున్న టీడీపీ మూకలు రెండోరోజు గురువారం కూడా అదే తరహా దౌర్జన్యాలకు పాల్పడ్డాయని విమర్శించారు. ఈ ఘటనలకు నిరసనగా గురువారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్ ఎదుట ఎంపీటీసీ అభ్యర్థులతో కలిసి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి ధర్నా నిర్వహించారు.

'81 స్థానాల్లో ఒక్క నామినేషన్ కూడా వేయనివ్వలేదు'

ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. రాప్తాడు నియోజకవర్గంలో 81 ఎంపీటీసీ స్థానాలుండగా తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు చేయనీయలేదన్నారు. రెండోరోజు గురువారం పలు ప్రాంతాల్లో యుద్ధ వాతావరణం సృష్టించారని ఆరోపించారు. కనగానపల్లి మండలంలో తగరకుంట కొండారెడ్డి హత్య కేసులో నిందితుడిగా పేర్కొన్న తగరకుంట రామాంజనేయులు కొడవళ్లు, కర్రలతో వీరంగం సృష్టించాడని విమర్శించారు. ఈ ఘటనలో ఎస్ఐ అక్కడి నుంచి వెళ్లిపోయారని, ఆయన వాహనాన్ని పల్టీలు కొట్టించారని ఆరోపించారు. పోలీసులపైనే దాడులకు ప్రయత్నించే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

'30 ఏళ్ల తర్వాత మళ్లీ అదే దౌర్జన్యకర పరిస్థితులు'

1995లో పరిటాల రవి నేర సామ్రాజ్యాన్ని స్థాపించి ఎన్నికలను దౌర్జన్యంగా ఏకగ్రీవం చేసుకున్నారని తోపుదుర్తి విమర్శించారు. 30 ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. పరిటాల సునీత, ఆమె కుమారులు, సోదరులు, బంధువులు, అనుచరులు, రాప్తాడు, ధర్మవరం, అనంతపురం నగరాలకు చెందిన కిరాయి మూకలతో ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నారని ఆరోపించారు. కర్రలు, కత్తులు పట్టుకుని, రాళ్లు విసురుతూ దాడులకు దిగుతున్న శక్తులను పరిటాల కుటుంబం ప్రోత్సహిస్తోందని విమర్శించారు.

'11 మంది అభ్యర్థులను అప్పగించినా నామినేషన్లు వేయించలేదు'

అత్మకూరు మండలంలో ఎంపీటీసీ అభ్యర్థులను తమకు అప్పగిస్తే తీసుకెళ్లి నామినేషన్లు వేయిస్తామని పోలీసులు చెప్పారని తోపుదుర్తి తెలిపారు. ఈ మేరకు 11 మంది అభ్యర్థులను మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఏఎస్పీ, ఏఆర్ ఏఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, ప్రత్యేక పోలీసు బలగాల సమక్షంలో అప్పగించామన్నారు. అనంతరం వారిని సీఐ హేమంత్‌కుమార్‌కు అప్పగించారన్నారు. శ్రీరామ్‌బాబు చెబితేనే నామినేషన్లు వేయిస్తానని ఆయన స్పష్టం చేశారని ఆరోపించారు. చివరకు ఆ రోజు కూడా అభ్యర్థులతో నామినేషన్లు దాఖలు చేయించలేదని విమర్శించారు. రాష్ట్రంలోనే అత్యంత సున్నితమైన నియోజకవర్గంగా ఉన్న రాప్తాడులో ప్రత్యేక బలగాలను ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు.



అభ్యర్థులు, నాయకులపై దాడులు.. దాడి చేసిన వారికే పోలీసుల రక్షణ

కలెక్టరేట్ వెనుక ఉన్న అనంతపురం రూరల్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద సంఘ వ్యతిరేక శక్తులుగా మారిన చల్లా జయకృష్ణ, కుమ్మరి రామాంజనేయులు, భరత్ తదితరులు వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థులు, నాయకులపై దాడులకు తెగబడ్డారని తోపుదుర్తి ఆరోపించారు. దాడులకు పాల్పడిన వారినే పోలీసులు కాపాడుతున్నారని విమర్శించారు. రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లోనూ ఇదే తరహా దాడులు జరిగాయని తెలిపారు. ఈ ఘటనలన్నింటిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

'చివరి రోజైనా నామినేషన్లు వేయించండి'

రెండు జిల్లాల కలెక్టర్లు, ఐజీ, ఎస్పీలు తక్షణమే స్పందించి చివరి రోజు అయినా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులందరికీ నామినేషన్లు దాఖలు చేసే అవకాశం కల్పించాలని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సీఐలు, ఎస్ఐలపై తమకు నమ్మకం లేదని పేర్కొన్నారు. తాము శాంతిభద్రతలను చేతుల్లోకి తీసుకోవాలనుకోవడం లేదని, ప్రజాస్వామ్యంపై తమకు నమ్మకం ఉందని స్పష్టం చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమ పార్టీ అభ్యర్థులు నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిఆర్ఓ మలోలాకు వినతి పత్రం అందజేశారు.

అనంతలో కూటమి శంఖారావం.. ఎన్నికల సమరానికి పకడ్బందీ వ్యూహం



- అర్బన్ టీడీపీ కార్యాలయంలో కూటమి పార్టీల సమన్వయ సమావేశం
- మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో క్యాడర్ కు దిశానిర్దేశం
- ఇక్కడ ఎన్డీఏ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమన్న మంత్రి సత్యకుమార్
- మేయర్, 62స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలన్న ఎమ్మెల్యే దగ్గుపాటి
- సమిష్టిగా పనిచేసి అన్ని స్థానాల్లో విజయకేతనం ఎగురవేస్తాం..అజేష్ యాదవ్

అనంతపురం, అక్టోబర్ 22, దరువు న్యూస్ :

అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల సమరానికి కూటమి పార్టీలు పకడ్బందీ వ్యూహంతో సమరశంఖం పూరించాయి. మున్సిపల్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అఖండ విజయమే లక్ష్యంగా నగరంలోని అర్బన్ టీడీపీ కార్యాలయంలో కూటమి పార్టీల (టీడీపీ, జనసేన, బీజేపీ) ముఖ్య నేతలు, కార్పొరేటర్ అభ్యర్థుల వ్యూహాత్మక సమన్వయ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్, స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి, మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్‌తో పాటు 62 వార్డుల కార్పొరేటర్ అభ్యర్థులు, క్లస్టర్ ఇంచార్జ్‌లు, ముఖ్య నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నగరాభివృద్ధిపై కూటమికి స్పష్టమైన ప్రణాళిక ఉంది : మంత్రి సత్యకుమార్

ఈ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. అనంతపురం నగర అభివృద్ధిపై ఎన్డీఏ కూటమికి ఒక స్పష్టమైన ప్రణాళిక ఉందని స్పష్టం చేశారు. 2014-19 మధ్య జరిగిన ప్రగతిని, ఆ తర్వాత 2019-24 వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అవినీతి, అరాచకాలను ప్రజలు గమనించారని గుర్తు చేశారు. నగరానికి పెద్ద సమస్యగా మారిన డంపింగ్ యార్డ్‌లో ఇప్పటికే 75 శాతం చెత్తను విజయవంతంగా క్లియర్ చేశామని, త్వరలోనే అక్కడ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్, ఆధునిక పార్కును తీసుకొస్తామని హామీ ఇచ్చారు. పట్టణాల అభివృద్ధి కోసం కేంద్రం రూ.4.5 లక్షల కోట్లు కేటాయించిందని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రూ.30 వేల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను మార్చేవేశారన్నారు. అలాగే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష కోట్లతో ఇక్కడ హార్టీకల్చర్ హబ్ తీసుకురానున్నారని వెల్లడించారు. కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానికంగానూ ఎన్డీఏ ప్రతినిధి ఉంటేనే నిధులు తీసుకురావడం సాధ్యమవుతుందని, వైఎస్సార్‌సీపీకి వేసే ఓటు పూర్తిగా వృథా అవుతుందన్నారు. ప్రజలు అభివృద్ధి వైపే నిలబడాలని పిలుపునిచ్చారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పులను వక్రీకరిస్తూ జగన్ మోహన్ రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నారని మంత్రి ధ్వజమెత్తారు.

అభ్యర్థుల గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి: ఎమ్మెల్యే దగ్గుపాటి

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు సీట్ల సర్దుబాటు కోసం సమిష్టిగా చర్చించుకున్నామని, ఇకపై క్షేత్రస్థాయిలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రచారంలో దూసుకు పోవాలని పిలుపునిచ్చారు. గత రెండేళ్ల కాలంలోనే అనంతపురంలో రూ.1300 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, రూ.300 కోట్లతో మౌలిక వసతులు కల్పించామన్నారు. ఈ అభివృద్ధి కొనసాగాలంటే మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్‌ను, అలాగే 62 వార్డుల కూటమి కార్పొరేటర్లను భారీ మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. 62 డివిజన్ల అభ్యర్థులకు, క్లస్టర్ ఇంచార్జ్‌లకు ఎన్నికల వ్యూహాలు, పోలింగ్ మేనేజ్‌మెంట్‌పై ఆయన స్పష్టమైన మార్గదర్శకాలు చేశారు.

సమిష్టి కృషితో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటాం : అజేష్ యాదవ్

కూటమి మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కూటమి అగ్రనేతలకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తే నగరం మళ్లీ వెనుకబాటుకు గురవుతుందని, ఎన్డీఏ ప్రభుత్వంతోనే అనంతపురం కార్పొరేషన్ సగర్వంగా నిలబడుతుందని ధీమా వ్యక్తం చేశారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కష్టపడి అన్ని స్థానాల్లో క్లీన్ స్వీప్ చేస్తామని, అనంతపురం మేయర్ పీఠాన్ని ఎన్డీఏ కూటమికి బహుమతిగా ఇస్తామని స్పష్టం చేశారు. సమావేశానికి హాజరైన కార్పొరేటర్ అభ్యర్థులు, క్లస్టర్ ఇంచార్జ్‌లు అందరూ అజేష్ యాదవ్‌ను అఖండ మెజారిటీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్ కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





స్పీడ్ పెంచిన 'ఫ్యాన్'

- ప్రజలతో మమేకమవుతూ..
- అడుగడుగునా రమేష్ గౌడ్‌కు నీరాజనం
- మా ఓటు మీకేనంటూ.. అప్యాయతగా పలుకరిస్తున్న ప్రజలు
- దర్గాలో ప్రత్యేక దువా చేసిన మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్

అనంతపురం నగరపాలక సంస్థ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి చిట్టూరు రమేష్ గౌడ్ ఎన్నికల ప్రచారంలో స్పీడ్ పెంచారు. ఎక్కడికెళ్లినా ప్రజలు ఆప్యాయతతో అడుగడుగునా నీరాజనం పలుకుతున్నారు. ప్రజలతో మమేకమవుతూ రమేష్ గౌడ్ ముందుకెళ్తున్నారు. తనకు మేయర్‌గా ఒక అవకాశం కల్పించాలని అభ్యర్థిస్తున్నారు. దీనికి ప్రజలు కూడా మా ఓటు మీకే.. నాయనా.. అంటున్నారు. మీ ఇంటి బిడ్డను నన్ను ఆశీర్వదించాలని ఓటర్లను రమేష్ గౌడ్ వేడుకుంటున్నారు.

అనంతపురం, అక్టోబర్ 22, దరువు న్యూస్ :

దర్గాలో ప్రత్యేక దువా చేసిన మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్



నగరంలోని పాతూరు శ్రీ సయ్యాదా మాసుమా బీబీ సాహెబ్ దర్గాలో ముస్లిం మైనారిటీ నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక దువా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎసఆర్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ పాల్గొన్నారు. దువా కార్యక్రమం అనంతరం వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్, 13వ డివిజన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సిలార్ బాషాతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. డివిజన్లోని ప్రతి ఇంటికి వెళ్లి 'ఫ్యాన్' గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. నగర అభివృద్ధి కోసం వైసీపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముస్లిం మైనారిటీ నాయకులు రమేష్ గౌడ్ నాయకత్వానికి మద్దతు తెలిపి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు తమవంతు కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ వసీం, వైసీపీ నాయకులు ఏకేఎస్ ఫయాజ్, రిజ్వాన్, ఏడీసీసీ మాజీ బ్యాంక్ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, 13వ డివిజన్ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాయనా.. 'ఫ్యాన్' గుర్తుకే ఓటు వేస్తాం..

'నాయనా.. మేము ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తాం' అంటూ 9వ డివిజన్‌లో ఒక పృద్ధురాలు వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్‌కు తన మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా మేయర్ అభ్యర్థి సి.రమేష్, 9వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి రాధా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ప్రజలను కలిసిన అభ్యర్థులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నారు. మురుగునీటి సమస్యలు, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం తదితర స్థానిక అవసరాలపై స్థానికులు అభ్యర్థి రమేష్‌కు వివరించారు. స్పందించిన మేయర్ అభ్యర్థి సి.రమేష్ మాట్లాడుతూ.. 'మీరు నమ్మకంతో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తే, గెలిచిన వెంటనే డివిజన్‌లో నెలకొన్న సమస్యలకు ప్రాధాన్యతతో పరిష్కారం అందిస్తాం' అని భరోసా ఇచ్చారు. ప్రజల సమస్యలు తమకు ప్రధాన ప్రాధాన్యత అని, అభివృద్ధి, సేవలపై దృష్టి సారిస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రచారంలో భాగంగా కార్యకర్తలు ఓటర్లను 'ఫ్యాన్' గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ, మేయర్ అభ్యర్థి రమేష్, కార్పొరేటర్ అభ్యర్థి రాధా విజయం కోసం పూర్తి స్థాయి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైసీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు రాజశేఖర్ రెడ్డి, పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, గోపాల్, లోకేష్ రెడ్డి, మక్బూల్, జిలాన్, షమీర్, ఫరీద్, గౌస్ పీర్, సాధిక్, మోహన్, బుడాన్, సీపీఐ నాయకుడు గోల్డ్ బాషా తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





'ఫ్యాన్' గుర్తుకు ఓటు వేసి గెలిపించండి

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్, 61వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మాలపాటి వాసంతిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. 61వ డివిజన్‌లోని రజక నగర్‌లో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని ఇంటింటికి తిరుగుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్, 61వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి మాలపాటి వాసంతి గెలిపించాలని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిపిస్తే అనంతపురం అభివృద్ధికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాసులు, వైసీపీ నాయకులు వెంకటేష్, మహిళలు, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రమేష్ గౌడ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటాం..

- దళిత సంఘాల నాయకులు

అనంతపురం, అక్టోబర్ 22, దరువున్యూస్ :



బడుగు బలహీన వర్గాల అండగా నిలిచే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ర్థి రమేష్ గౌడ్ అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని దళిత సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ జన సంఘం దాసుగానపల్లి కుల్లాయప్ప, గిరిజన ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జున నాయక్, బికేఎస్ ఆనంద్, ఎస్సీ జన సంఘం స్టూడెంట్ వింగ్ మేకల రమేష్, జై భీమ్ పార్టీ సురేష్, అశోక్ కుమార్‌లు మాట్లాడుతూ.. రమేష్ గౌడ్ కరోనా సమయంలో నగరంలో అనేక మందికి సాయం అందించిన ఘనత రమేష్‌గౌడ్‌కి దక్కుతుందని, అలాంటి వ్యక్తిని అనంతపురం నగర మేయర్ అభ్యర్థిగా గెలిపించుకోవడం మనం దరిపై బాధ్యత ఉందని తెలియజేశారు. మేయర్ అభ్యర్థితో పాటు 62 డివిజన్ల వైసీపీ అభ్యర్థులను కూడా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు చాలా సంతోషంగా ఉన్నారని, నగరంలో బీసీ కులాలలో చాలామంది ఉన్నప్పటికీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి గుర్తించి రమేష్ గౌడ్‌ను మేయర్ అభ్యర్థిగా ప్రకటించడం అభినందనీయమన్నారు. యువత ముందుకు వచ్చి రమేష్‌కు అండగా నిలవాలని తెలియజేశారు. రమేష్‌గౌడ్‌కు ప్రజా సమస్యలపై అవగాహన ఉందని, మేయర్ పీఠంపై రమేష్‌గౌడ్‌ను కూర్చోబెడితే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతపురం నగరానికి మేయర్గా రమేష్‌గౌడ్ అవసరం ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం దళిత సంఘాల నాయకులు రమేష్‌గౌడ్‌కు సంపూర్ణ మద్దతు తెలియజేశారు.

రేయ్ బండి పక్కన పెట్టు !

- నేను ఈ నగరంలో ఒక సామాన్యుడిని
- ట్రాఫిక్ సమస్య మనము ఇచ్చిన హామీలలో ఒకటి
- మనమే రోడ్డుకు అడ్డం పెడితే ఎలా?
- వైకాపా మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ సీరియస్

అనంతపురం, అక్టోబర్ 22, దరువు న్యూస్ :

శాంతి కామకుడైన నగర వైకాపా మేయర్ అభ్యర్థికి కోపం వచ్చింది.. ఆ కోపం ఎవరి మీద కాదు, తన డ్రైవర్ మీదే.. ఏ అంశంపై అనే వివరాల్లోకి వెళితే..







అనంతపురం వైకాపా మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ ఎన్నికల ప్రచారంలో ఒక ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది.. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్డు పక్కన ఉన్న ఒక టీ కొట్టు వద్ద టీ తాగుతుండగా, తన డ్రైవర్ రోడ్డు మీదే వాహనం ఆపాడు.. ప్రజలతో ముచ్చటిస్తూ రోడ్డుపైన నిలబెట్టిన తన వాహనాన్ని గమనించాడు. వెంటనే రేయ్, కారు పక్కన పెట్టు అంటూ రమేష్ బిగ్గరగా అరిచాడు.. వాహనం దూరంలో నిలబెట్టి తన వద్దకు వచ్చిన డ్రైవర్ తో మేయర్ అభ్యర్థి రమేష్, మనమే రోడ్డుకు అడ్డంగా కారు నిలబడితే ఎలా? ట్రాఫిక్ సమస్య పరిష్కారం మన ఎన్నికల హామీలలో ఒకటి, ఈ ఊరు వాళ్లమే.. మనం సామాన్యులం, జాగ్రత్తగా మసులుకోవాలి అంటూ ఆ డ్రైవర్‌కు హితవచనాలు చెప్పాడు. దీంతో టీ స్టాల్ వద్ద ఉన్న జనం, మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ ప్రవర్తన తీరు పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పలు సమస్యలపై ప్రజలతో రమేష్ గౌడ్ ముచ్చటించారు.

నార్పల జడ్పీటీసీ అభ్యర్థిగా ఈశ్వరయ్య నామినేషన్



అనంతపురం, అక్టోబర్ 22, దరువు న్యూస్ :

నార్పల మండల జడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అంకే ఈశ్వరయ్య గురువారం నామినేషన్‌ను జనసేన పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు టీసీ వరుణ్‌తో కలిసి దాఖలు చేశారు. అనంతపురంలోని స్థానిక జడ్పీ కార్యాలయం నందు నార్పల జడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన పార్టీ నుండి అంకె ఈశ్వరయ్య నామినేషన్ వేశారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టీసీ వరుణ్, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే మురళీకృష్ణ జనసేన నాయకులతో కలిసి నామినేషన్ కార్యక్రమంలో ఘనంగా పాల్గొన్నారు.

రెండో రోజు ప్రశాంతంగా నామినేషన్ల స్వీకరణ

పామిడి, అక్టోబర్ 22, దరువు న్యూస్ :

మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రెండో రోజు నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. రెండో రోజు 15 నామినేషన్లు స్వీకరించగా, మొదటి రోజు దాఖలైన 3 నామినేషన్లతో కలిపి మొత్తం 18 నామినేషన్లు స్వీకరించినట్లు రిటర్నింగ్ అధికారి, ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా వారు వెల్లడించిన వివరాల మేరకు తెలుగుదేశం18 నామినేషన్లు దాఖలు చేసినట్లు వివరించారు. నామినేషన్ల దాఖలుకు రేపు సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మరోవైపు నామినేషన్ల దాఖలులో భాజపా, తెలుగుదేశం పార్టీ నాయకులు చురుగ్గా పాల్గొన్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆసక్తి చూపారు. ఈ ప్రక్రియను రిటర్నింగ్ అధికారి , ఎంపీడీవో పర్యవేక్షించారు. నామినేషన్ కార్యాలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ మనోహర్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరివేక్షణ చేస్తూ ఎలాంటి అల్లర్లు లేకుండా ప్రశాంతంగా నామినేషన్ ప్రక్రియ కొనసాగే విధంగా వారు దోహదపడ్డారు. ప్రశాంతమైన వాతావరణంలో ఆయా పార్టీ నాయకులు కార్యకర్తలు తమ నామినేషన్లు అందజేశారు.


మేయర్, కార్పొరేటర్ల అభ్యర్థుల విజయం కోసం పని చేయండి

- వైభవ్ రెసిడెన్సీలో బీసీ నాయకులతో మంత్రి సత్యకుమార్

అనంతపురం, అక్టోబర్ 22, దరువున్యూస్ :



నగరంలోని వైభవ్ రెసిడెన్సీలో ఎస్ఆర్ లోకేష్ బాబు ఆధ్వర్యంలో బీసీ నాయకులతో మంత్రి సత్యకుమార్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రితోపాటు నగరపాలక సంస్థ బీజేపీ మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు ఎస్ఆర్ నాగభూషణం, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చక్రధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో, స్థానికంగా కూడా ఎన్డీఏ కూటమి అధికారంలో ఉంటేనే నిధులు సమకూర్చుకుని నగరాన్ని మరింత అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందన్నారు. వైసీపీకి ఓటు వేస్తే ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానించారు. నగరంలో అభివృద్ధి ప్రస్థానం కొనసాగాలంటే కూటమి మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని బీసీ నాయకులకు పిలుపునిచ్చారు. వైసీపీకి ఓటు వేస్తే అనంతపురం నగరం మళ్లీ వెనుకబడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేసి అన్ని స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మొత్తంగా అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కూటమి పార్టీలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. అనంతరం ఎస్ఆర్ నాగభూషణం మాట్లాడుతూ.. ఎన్డీయే కూటమి విజయం సాధిస్తేనే అనంతపురం నగరం అభివృద్ధి చెందుతుందన్నారు. కావున బీసీ నాయకులంతా మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్‌తోపాటు కార్పొరేటర్ల అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పెద్ద ఎత్తున బీసీ నాయకులు, యువత తదితరులు పాల్గొన్నారు.



నాయక్ నగర్‌లో వైసీపీ కార్యకర్తలపై ..

మాజీ డిప్యూటీ మేయర్ వర్గీయుల దాడి

- ఎన్నికల ప్రచారం ముగించుకుని ఇంటికి వెళ్తుండగా కర్రతో వైసీపీ కార్యకర్తపై దాడి

అనంతపురం, అక్టోబర్ 22, దరువు న్యూస్ :

అనంతపురం నగరంలోని 39వ డివిజన్ నాయక్ నగర్‌లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై దాడి జరిగింది. ఇద్దరు వైసీపీ కార్యకర్తల తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న వర్గీయులు దాడి చేసినట్లుగా బాధితులు తెలియజేశారు. గాయపడిన వారిని అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. డివిజన్‌లో తెలుగుదేశం పార్టీ ఓటమి భయంతోనే దాడులకు తెగబడుతిందన్న వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, 39వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి సాకే చంద్రశేఖర్ వాపోయారు. విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట రామిరెడ్డి బాధితులను ప్రభుత్వ ఆస్పత్రిలో వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, నగర మేయర్ అభ్యర్థి సి.రమేష్ గౌడ్, వైసీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి తదితరులు పరామర్శించారు.





Editor, Prblished and Owned by YENUMULA KULLAYAPPA, Published for D.No. 5-76, Bhanukota, Sri Satya Sai - 515621, Printed from Jai Sriram Publications D.No. 1-3-241, Rangaswamy nagar, Ananthapuramu 515001, EDITOR : YENUMULA KULLAYAPPA Mobile : 94940 39030.